క్లుప్తంగా

సర్వసభ్య సమావేశం వాయిదా

ఫిరంగిపురం: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం 11గంటలకు నిర్వహించాల్సిన సర్వసభ్య సమావేశం వాయిదా పడినట్లు ఎంపీడీఓ విమాదేవి తెలిపారు. సమావేశానికి రావల్సిన 18 మంది ప్రజాప్రతినిధులకు గాను ఆరుగురు మాత్రమే హాజరు కావడంతో కోరం లేని కారణంగా సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఆమె చెప్పారు. తిరిగి సమావేశం ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామన్నారు. సమావేశంలో ఎంపీపీ షేక్ షహేలానర్గీస్ ఉన్నారు.

నవయుగ వైతాళికుడు కందుకూరి



లక్ష్మీపురం: కుల, మత, వర్ణ, వర్గ విభేదాలు లేని ఆదర్శ సమాజం కోసం కృషి చేసిన సంఘ సంస్కర్త, నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం తెలుగు వారందరికీ చిరస్మరణీయుడని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కందుకూరి జయంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాటక రచయిత దర్శకుడు కావూరి సత్యనారాయణ, సాహితీవేత్త ముప్పాళ్ల ప్రసాదరావు, విద్యావేత్త ఈ.చంద్రయ్య పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం బలోపేతంలో యువత పాత్ర కీలకం



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రజాస్వామ్య బలోపేతంలో విద్యార్థులు, యువతే కీలక భూమిక పోషించాలని లెట్స్ ఓట్ ఆర్గనైజేషన్ జిల్లా కన్వీనర్ టి.బాలాజీ శ్రీనివాస్ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో మంగళవారం లెట్స్ ఓట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఓటు హక్కు, ప్రజాస్వామ్య విలువలు, ప్రాధాన్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య భారతదేశంలో 60 శాతం పైగా ఉన్న యువత, విద్యార్థులపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని తెలిపారు. రాబోవు పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో యువత విజ్ఞతతో వ్యవహరించి, ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. లెట్స్ ఓట్ సంస్థ జాతీయ ఎన్నికల కమిషన్ గుర్తింపు పొందిందని తెలిపారు. రాజకీయాల కతీతంగా నూరు శాతం ఓటుహక్కు వినియోగించుకునేందుకు ప్రజల్ని చైతన్యపరిచే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి. నాగభూషణం మాట్లాడుతూ విద్యార్థుల్ని దేశభక్తి, ప్రజాస్వామ్యం పట్ల బాధ్యత కలిగిన పౌరులుగా తీర్చిదిద్దేందుకు చైతన్య కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులతో ఓటుహక్కు ప్రమాణ పత్రం చదివించి, ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో లెట్స్ ఓట్ సభ్యులు వేమూరి సోమయాజులు, మేడూరి రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కె.రవికుమార్, ఓఎస్డీ పి. సీతారామయ్య, ఎన్. హేమకుమారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిషేధిత సిగరెట్లు విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

గుంటూరు ఈస్ట్: నిషేధిత సిగరెట్లు విక్రయిస్తున్న వ్యక్తిపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ శ్రీహరిరావు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం హౌసింగ్ బోర్డు కాలనీలో మాల్యాద్రి నిషేధిత సిగరెట్లు విక్రయిస్తున్నాడు. ఈ సమయంలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడిచేసి రూ. 1.68 లక్షల విలువ చేసే సిగరెట్లు స్వాధీనం చేసుకుని నల్లపాడు పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు అదనపు జిల్లా జడ్జిలకు సత్కారం



నగరంపాలెం : బదిలీపై వెళుతున్న జిల్లా అదనపు జడ్జిలు పి.వి.ఎస్.సూర్యనారాయణ, సీతారామకృష్ణారావు, బి.అర్చనలను మంగళవారం జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ హాలులో సత్కరించారు. మూడేళ్లపాటు పలు కేసుల్లో మంచి తీర్పు వెలువరించారని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి పార్థసారథి, బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి, న్యాయవాదులు పాలడుగు వెంకటేశ్వర్లు, నందా రమేష, భరద్వాజ, శ్యామల పాల్గొన్నారు.

లోకేష్‌ను ఓడిస్తాం.. చరిత్ర సృష్టిస్తాం

- 25వేలకుపైగా ఓట్లతో లావణ్య గెలవబోతోంది
- డబ్బు సంచులతో గెలవాలనుకుంటే కుదరదు
- హత్యా రాజకీయాలు చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య
- ఎవరెన్ని కుట్రలు చేసినా జగనన్న మళ్లీ సీఎం అవడం తథ్యం
- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)



ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య, ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, గంజి చిరంజీవి

మంగళగిరి: మంగళగిరిలో నారా లోకేష్‌ను ఒకసారి తాను ఓడించానని మరో సారి బీసీ మహిళ చేతిలో ఓడించి చరిత్ర సృష్టిస్తామని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) స్పష్టం చేశారు. మంగళగిరి పట్టణంలోని 24వ వార్డు పాత మంగళగిరిలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య ప్రచారం నిర్వహించగా ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, మాజీ ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవిలు ఇంటింటికి తిరిగి వైఎస్సార్ సీపీ అభ్యర్థి లావణ్యకు ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలలో వస్తున్న ఆదరణతో బెంబేలెత్తిన చంద్రబాబు హత్యారాజకీయాలను వెనుకాడడం లేదన్నారు. చంద్రబాబుకు హత్యారాజకీయాలు వెన్నతో పెట్టిన విద్య అని అది రాష్ట్రప్రజలకు తెలుసన్నారు. రానున్న ఎన్నికలలో ప్రజాభిమానంతో సీఎం జగనన్న ముఖ్యమంత్రి కావడం తథ్యమని స్పష్టం చేశారు. మీ ఇంట్లో మంచి జరిగితేనే మీ బిడ్డకు అండగా ఉండండి అన్న రాజకీయ నాయకుడు ప్రపంచ రాజకీయ చరిత్రలో ఒక్క జగనన్న మాత్రమేనన్నారు. అంత నిజాయతీ వుంటే చంద్రబాబు లోకేష్‌లు గత టీడీపీ పాలన 14 సంవత్సారాలలో ప్రజలకు చేసిన మంచి ఏమిటో చెప్పి ఓట్లు అడగాలన్నారు. 2024 ఎన్నికలతో చంద్రబాబు, లోకేష్‌లకు రాజకీయ సమాధి తప్పదు కనకే హత్యా రాజకీయాలకు తెరతీశారని మండిపడ్డారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రజల దీవెనతో రెండు నెలల్లో జగనన్న మళ్లీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని స్పష్టం చేశారు. మంగళగిరిలో లావణ్య 25 వేలకుపైగా ఓట్లతో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మునగాల మల్లేశ్వరరావు, తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్క వేణుగోపాలస్వామి రెడ్డి,పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, రావెల మురళీకృష్ణ, మాచర్ల శ్రీను, కుర్నెళ్ల చంద్రశేఖర్, గోలి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఘనంగా సీతారాముల కల్యాణం

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఉండవల్లి, అమరావతి కరకట్ట వెంబడి గల రాధాశ్యామ్ సుందర్‌మందిరంలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి శ్రీరామ నవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని, అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేస్తామని శ్యామసుందర అచ్యుతదాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

– ఎంటీఎంసీ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై త్రిదండి చిన్నజీయర్ స్వామి వారి మంగళ శాసనాలతో బుధవారం ఉదయం 9.30 నిమిషాలకు శ్రీ సీతారామచంద్రులకు కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామని, భక్తులు అధికసంఖ్యలో పాల్గొని కల్యాణ మహోత్సవాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని, అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

నేడు భారీ అన్నదానం

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని మహానాడు 22వ రోడ్డు ఎదురుగా శ్రీరామనవమి సందర్భంగా నేడు భారీ అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఎంపీటీసీ మాజీ సభ్యుడు గోగుల శ్రీను మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. శ్రీరామనవమి సందర్భంగా ఉదయం కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామని భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని కల్యాణ మహోత్సవాన్ని తిలకించి అన్నప్రసాదాలు స్వీకరించవలసినదిగా కోరారు.

– తాడేపల్లి రూరల్ కుంచనపల్లిలో కోదండ రామాలయంలో శ్రీరామనవమిని పురస్కరించుకుని బుధవారం కల్యాణ మహోత్సవం, అనంతరం 11 గంటలకు అన్నప్రసాద పంపిణీ, సాయంత్రం సీతారాముల గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలియజేశారు.



తక్కెళ్లపాడులో రామమందిరం వద్ద వేసిన పందిరి

నవమికి రామాలయాలు సిద్ధం...

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లోని రామాలయాల వద్ద శ్రీరామనవమిని పురస్కరించుకొని రంగులు, తాటాకు పందిళ్లు వేస్తూ ఏర్పాట్లు చేస్తున్నారు. ఫిరంగిపురంలోని సీతా రామాలయం వద్ద, రేపూడిలోని కోదండరామాలయం వద్ద, తక్కెళ్లపాడులోని రామమందిరం, సీతారామచంద్ర స్వామి ఆలయం వద్ద, రేగుల గడ్డలోని కోదండ రామాలయం వద్ద పందిళ్లు వేసి ఆలయాలను సుందరంగా అలంకరించి నవమికి సిద్ధం చేస్తున్నారు. పొనుగుపాడులోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం సీతారామ కల్యాణం నిర్వహించనున్నట్లు దేవదాయ ధర్మాదాయశాఖ ఈఓ రామిరెడ్డి మంగళవారం తెలిపారు.

నవమి వేడుకలకు సర్వం సిద్ధం



విద్యుత్ కాంతులతో కళకళలాడుతున్న పెదకాకాని సగరపాలెం రామాలయం

పెదకాకాని: శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయాలు సిద్ధం అయ్యాయి. పెదకాకాని మండల పరిధిలోని ఆయా గ్రామాలలో రామాలయాలను శోభాయమానంగా అలంకరించారు. రాత్రి వేళలలో ఆలయాలు, పందిళ్లు విద్యుత్ కాంతులతో కళకళలాడుతున్నాయి. యూత్‌లు,కమిటీల ఆధ్వర్యంలో బజార్లలో పందిళ్లు వేసి అలంకరించారు. ఆయా గ్రామాల్లో ఆలయాలకు రంగులు వేసి పండుగకు ముస్తాబు చేశారు. శ్రీరామనవమి వేడుకలు అనగానే ముందుగా గుర్తుకు వచ్చే పానకం, వడపప్పు, పొంగలి నైవేద్యం, పులిహోర పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. పెదకాకాని వై జంక్షన్‌లో గత మూడు రోజులుగా శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు, ఆంజనేయస్వామివార్ల విగ్రహాలను తయారుచేసి విక్రయానికి సిద్ధంగా ఉంచారు. భక్తులు కొనుగోలు చేస్తున్నారు.

శ్రీరామనవమికి ఆలయాలు ముస్తాబు

పొన్నూరు: శ్రీరామ నవమి పర్వదినం పురస్కరించుకుని పొన్నూరులోని ఆలయాలు ముస్తాబయ్యాయి. బుధవారం పండుగ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొనే భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీలు అన్ని ఏర్పాట్లు చేశారు. వేసవి దృష్ట్యా చలువ పందిళ్లు ఏర్పాటు చేసి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేశారు. తెలగపాలెంలోని కోదండరామాలయం, వాసవి కన్యకా పరమేశ్వరీ అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలోని రామాలయం, నేతాజీనగర్‌లోని రామాలయాలు వేడుకలు సిద్ధమయ్యాయి.



విద్యుద్దీప కాంతుల్లో పొన్నూరులోని కోదండ రామాలయం

సీఎం జగన్‌పై అల్లా దీవెనలు ఉండాలి

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అల్లా దీవెనలు ఉండాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని మంగళవారం దుగ్గిరాలలోని ముర్తుజానగర్ జెండా చెట్టు వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్ సుభాని మాట్లాడుతూ బస్సుయాత్రకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక దాడులు చేయడం సరికాదన్నారు. దేవుడి దయతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రాణాపాయం తప్పిందన్నారు. జగనన్నపై అల్లా దీవెలను ఉండాలని ప్రత్యేక దువా చేయడం జరిగిందని, దిగ్విజయంగా బస్సుయాత్రను పూర్తిచేసుకుని రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించి మళ్లీ రెండోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసి రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తారని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని, తదితరులు

వీఐటీ-ఏపీ, న్యూరాలిక్స్ మధ్య అవగాహన

తాడికొండ: వీఐటీ– ఏపీ విశ్వ విద్యాలయం, న్యూరాలిక్స్ మధ్య కృత్రిమ మేధస్సు (ఏఐ) పరిజ్ఞానం, పరిశోధనను అభివృద్ధి చేయడానికి అవగాహనా ఒప్పందం కుదిరినట్లు విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యూరాలిక్స్ ఇంక్ అనేది వివిధ పరిశ్రమలకు డిజిటల్ ట్రాన్స్‌మేషన్ సేవలను అందించే ప్రముఖ ఏఐ స్టార్టప్ అని ఈ అవగాహనా ఒప్పందం ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ రంగంలో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు, అధ్యాపకుల కోసం సహకార పరిశోధన, ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ కార్యకలాపాలను ప్రొత్సహించవచ్చన్నారు. న్యూరాలిక్స్ సీఈఓ మరియు వ్యవస్థాపకుడు డాక్టర్ జయరామ్ మాట్లాడుతూ ఈ భాగస్వామ్యం ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలు రాయిగా నిలుస్తుందన్నారు. ఐఐఈసీ డైరెక్టర్ డాక్టర్ అమిత్ చవాన్, ఏ1అండ్ ఆర్ డైరెక్టర్ డాక్టర్ హరిసీత, డీన్ స్కోప్ డాక్టర్ ప్రదీప్ రెడ్డి, ఐఐఈసీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుధా ఎలిసన్ మాతే, డాక్టర్ ఎస్.శిబిచక్రవర్తి పాల్గొన్నారు.

కిట్స్‌లో రక్తదాన శిబిరం

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కె.కె.ఆర్ అండ్ కె.ఎస్.ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (కిట్స్) కళాశాలలో మంగళవారం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, నీడ్స్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. వివిధ విభాగాలకు చెందిన 120 మంది విద్యార్థులు శిబిరానికి హాజరవ్వగా, వారిలో 104 మంది రక్తదానం చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు తెలిపారు. చైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ కళాశాల స్థాపించినప్పటి విద్యార్థులు రక్తదానం చేస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ప్రాణాన్ని కాపాడే శక్తి రక్తానికి మాత్రమే ఉంటుందని తెలిపారు. కళాశాల సెక్రటరీ కోయి శేఖర్ మాట్లాడుతూ రక్తదానం చేయడం వలన ఆపదలో ఉన్న ఎంతో మందికి ప్రాణదానం చేయవచ్చన్నారు. అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, విభాగాధిపతులు, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు చెక్కు పంపిణీ



పట్నంబజారు: ఇటీవల విజయవాడలోని తన నివాసంలో గుండెపోటుతో మృతి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ చెక్కును అందజేశారు. ఆర్మ్‌డ్ రిజర్వుడ్ హెడ్ క్వార్టర్స్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఎం.శ్రీనివాసరావు మృతి చెందారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని తన చాంబర్‌లో ఎస్పీ తుషార్ డూడీ మంగళవారం శ్రీనివాసరావు భార్య బాలనాగమ్మకు చేయూత, ఫ్లాగ్ ఫండ్, విడో ఫండ్ కింద రూ. 1.75 లక్షల చెక్కును అందించారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పొన్నూరు: అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా భారీ అగ్ని ప్రమాదాలను సైతం నివారించవచ్చని పొన్నూరు అగ్నిమాపక కేంద్రాధికారి కె.ప్రసాదరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా మంగళవారం పట్టణంలోని సెయింట్ ఆన్స్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అగ్నిమాపక సిబ్బంది విన్యాసాల ద్వారా ప్రదర్శించారు. నివారణకు సూచనల కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రసాదరావు మాట్లాడుతూ వేసవిలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ప్రమాదాలు సంభవించినపుడు భయపడకుండా ఆ ప్రమాదం నుంచి వెంటనే బయటపడే మార్గాలను ఎంచుకుని ప్రాణాలను దక్కించుకోవాలన్నారు. ప్రమాదాలు జరిగినపుడు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతల విస్తృత ప్రచారం



తాడేపల్లి నెహ్రూబొమ్మ సెంటర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మహిళలు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ప్రాంతాల వారీగా విస్తృతంగా పర్యటించి వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్యను, మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్యను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఆయా చోట్ల జరిగిన ప్రచారాల్లో పార్టీ పట్టణ అధ్యక్షుడు బుర్రముక్క వేణుగోపాల సోమిరెడ్డి గుంటూరు జిల్లా జేసీఎస్ కో–ఆర్డినేటర్ ఈదులమూడి డేవిడ్ రాజు, ఎంటీఎంసీ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డిలు మాట్లాడుతూ తాడేపల్లి పట్టణ పరిధిలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని ప్రచారం నిర్వహిస్తున్నామని, ఈ ప్రచారంలో భాగంగా తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడు, సుందరయ్యనగర్, ముగ్గురోడ్డు, నులకపేట తదితర ప్రాంతాల్లో నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో విస్తృత పర్యటన నిర్వహించామన్నారు. మంగళగిరి నియోజకవర్గంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులు నిర్వహించేందుకు రూ.120 కోట్లు కేటాయించి సకాలంలో పనులు పూర్తి చేశారన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళగిరి నియోజకవర్గంలో మరింత అభివృద్ధి జరగనుందని తెలిపారు. తాడేపల్లి పట్టణ జేసీఎస్ కన్వీనర్ దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కళ్లం రాజశేఖర రెడ్డి, మాజీ కౌన్సిలర్లు గోరేబాబు, అబ్బు, జింకా గంగాధర్, దర్శి విజయశ్రీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళ, యువజన, రైతు విభాగం కన్వీనర్లు ముదిగొండ ప్రకాష్, బాలసాని అనిల్, బత్తుల దాసు, అప్పికట్ల సంపూర్ణ పార్వతి, బందాపు రుక్మాంగరెడ్డి, జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి భూపతి కిషోర్‌నాయుడు, గుంటూరు జిల్లా సేవాదళ్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస మధు, జిల్లా ఎస్టీ సెల్ కన్వీనర్ మేడా వెంకటేశ్వరరావు, సచివాలయ కన్వీనర్లు సింహాద్రి గోపి, వేముల శివయ్య, జక్కిరెడ్డి కృష్ణారెడ్డి, మేకా వెంకటరెడ్డి, కె.సిద్ధార్థ్, బోయినపల్లి రాజు, జమ్మలపూడి జాషువా జార్జి, మైనపల్లి మణికుమార్, ఆళ్ళ ఉమా మహేశ్వరి, పూర్ణశంకర్ పాల్గొన్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు



ఫిరంగిపురంలో కార్యదర్శి శిరీషకు రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు



మేడికొండూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద రాజీనామా పత్రాలతో వలంటీర్లు

ఫిరంగిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి జరగడం హేయమని వలంటీర్లు అన్నారు. సీఎం జగన్‌కు మద్దతుగా పది మంది వలంటీర్లు మంగళవారం రాజీనామాలు చేశారు. మండల కేంద్రంలోని సచివాలయం -2 పరిధిలో పనిచేస్తున్న 21మంది వలంటీర్లకు గాను సీహెచ్ సిద్ధార్థ, వై.మేరి, ఎం.శివరావు, టి.వెంకటేశ్వర్లు, ఎ.రాజ్‌కుమార్, కె.వెంకటేశ్వర్లు, పి.విజ్ఞానచందన, ఆర్.చక్రవర్తి, ఆర్.నవీన, ఆర్.శైలు తమ రాజీనామాలను సచివాలయం కార్యదర్శి శిరీషకు అందజేశారు.

మేడికొండూరులో 33 మంది...

మేడికొండూరు: మేమంతా సిద్ధం బస్సు యాత్రలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన దాడికి నిరసనగా.. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా మండల కేంద్రమైన మేడికొండూరులో వలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు. 33 మంది వలంటీర్లు పంచాయతీ కార్యదర్శి శివరావుకు రాజీనామా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మండల వలంటీర్లు, అధికారులు పాల్గొన్నారు.

పాములపాడులో 10 మంది...

పాములపాడు(తాడికొండ): తాడికొండ మండలం పాములపాడు గ్రామంలో 10 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాలను కార్యదర్శి రామారావుకు అందజేశారు. మంచి చేస్తున్న జగనన్నకు మావంతు సాయంచేసి గెలిపించుకొని మళ్ళీ సీఎంగా చేసుకున్న తరువాతే ఉద్యోగాల్లో చేరతామని పలువురు స్పష్టం చేశారు.

అభ్యర్థితో పాటు నలుగురికే అనుమతి

- ప్రత్తిపాడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి.శ్రీకర్
- నామినేషన్ల దాఖలు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాజకీయ పార్టీల నేతలతో సమావేశం

ప్రత్తిపాడు: నామినేషన్ దాఖలు చేసే సమయంలో అభ్యర్థితో పాటు నలుగురిని మాత్రమే లోపలకు అనుమతిస్తామని ప్రత్తిపాడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి. శ్రీకర్ తెలిపారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో రాజకీయ పార్టీ నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 18 నుంచి నామినేషన్లను స్వీకరిస్తామన్నారు. అభ్యర్థులు కచ్చితంగా ఫారం-ఏ, ఫారం-బి, నాలుగు లేటెస్ట్ ఫొటోలు, ఫారం-2బి, ఫారం 26లు, సర్టిఫైడ్ కాపీలు.. తదితరాలను ఖచ్చితంగా నామినేషన్ దాఖలు చేసే సమయంలో అందించాలన్నారు. ఆర్వో కార్యాలయానికి వందల మీటర్ల వరకు మూడు వాహనాలను మాత్రమే అనుమతించడం జరుగుతుందన్నారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన తేదీల్లో ఉదయం పదకొండు గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకే నామినేషన్లను స్వీకరిస్తామన్నారు. అభ్యర్థులంతా కచ్చితంగా ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, నిబంధనలను తు.చ. తప్పకుండా పాటించాలన్నారు. ఇందులో పక్షపాతం అనేది ఏమీ ఉండదని ఆర్వో స్పష్టం చేశారు. అదేవిధంగా అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసే తేదీని ఒక్కరోజు ముందుగా తమకు సమాచారం అందిస్తే తదనుగుణంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. నామినేషన్ దాఖలు చేసే రోజు నుంచి ఎన్నికలు పూర్తయ్యేవరకు చేసే ఖర్చును అభ్యర్థి వ్యయంగానే పరిగణిస్తామన్నారు. నామినేషన్ రోజు చేసే ర్యాలీల ఖర్చు కూడా అభ్యర్థి ఖాతాలోనే నమోదు చేస్తామన్నారు.

అర్హత ఉన్న వారందరికీ ఓటు హక్కు..

ఏప్రిల్ 15వ తేదీవరకు నూతన ఓటు హక్కు కోసం వచ్చిన ప్రతి ఒక్క అర్జీని పరిశీలించి అర్హత ఉన్నవారికి ఓటు హక్కు కల్పిస్తామన్నారు. నియోజకవర్గంలో 85 సంవత్సరాలు నిండిన ఓటర్లు 1,870 మంది, పీడబ్ల్యూడీ ఓటర్లు 2,710 మంది ఉన్నారన్నారు. వారిలో ఆసక్తి ఉన్నవారికి ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తామని చెప్పారు. సమావేశంలో ఏఆర్వో పద్మజ, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నామినేషన్లకు పటిష్ట బందోబస్తు

ప్రత్తిపాడు: నామినేషన్లకు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు గుంటూరు సౌత్‌జోన్ డీఎస్పీ షేక్ మహబూబ్‌బాషా తెలిపారు. ఈనెల 18వ తేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలు కానుండటంతో నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద తీసుకోవలసిన భద్రతా చర్యలు, బందోబస్తు ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం ఆర్వో శ్రీకర్‌తో కలిసి గుంటూరు సౌత్‌జోన్ డీఎస్పీ మహబూబ్‌బాషా పరిశీలించారు. ఈ సందర్భంగా బారికేడ్లు ఏర్పాటు, స్టాపర్లు, ఆర్వో కార్యాలయానికి నాలుగు వైపులా వంద మీటర్ల పరిధి వర్తించే స్పాట్‌లను పరిశీలించారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా నామినేషన్లను దాఖలు చేయాలన్నారు. ప్రశాంత వాతావరణంలో నామినేషన్లు ముగిసేలా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పక్కా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.



బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్వో శ్రీకర్, సౌత్‌జోన్ డీఎస్పీ మహబూబ్‌బాషా